# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JULY - 2016**

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి :**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6:00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6:30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2:30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7:30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3:30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | **జాషువా గూటం** |
| | | **రిక్కీ గూటం** |
| | | **రోనీ గూటం** |

**youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి.

మీ బంధు మిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

**P.O. BOX. 80, KAKINADA**

**PIN : 533004, Ph : 0884 - 2363722**

**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు
## THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 004
Ph : 0884 - 2363722, 98489 98547

Editor :
**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి-36 జూలై - 2016 సంచిక 12

# క్రైస్తవ కుటుంబ జీవితము
## *(Christian Family Life)*

ప్రతి మానవునికి గృహము అత్యంత ప్రాముఖ్యమైనది. మానవుని పురోభివృద్ధి తన గృహముపై ఆధారపడి యున్నది. నిజ క్రైస్తవుని గృహము పరలోక ఆనందాన్ని భూలోకములోనే సూచించునదై యుండును. సంఘాభివృద్ధికి, దేశాభివృద్ధికి క్రైస్తవ కుటుంబము అత్యంత ప్రాముఖ్యమైనది.

అయితే ఆధునిక ప్రపంచంలో నవనాగరికత ప్రభావమువలన కూలిపోవుచున్నది ఏమైనను ఉన్నదంటే అది గృహము అని మనము చెప్పుకొనవచ్చును. ఏటేట లక్షలాది స్త్రీ పురుషులు తాము ఏర్పరచుకొనిన కుటుంబ జీవము నుండి దంపతులుగా విడిపోవుట జరుగుచున్నది. అయితే స్త్రీ పురుషులు తమ గృహము నేర్పరచుకొనుటలో దేవుని సంకల్పము ననుసరించి నడుచుకొనలేనందున ఇట్టి దుస్థితి నేడు ఏర్పడియున్నది.

దాంపత్య జీవితములో ప్రవేశించువారు నిజక్రైస్తవులు కాని యెడల క్రైస్తవ గృహమును వారు నిర్మించలేరు. దేవుని కొరకు దేవుని చిత్త ప్రకారము జీవించ గోరువారికి అపో. పౌలు ఈ విధముగా వ్రాయుచున్నాడు: "స్త్రీలారా, ప్రభువునకు వలె మీ సొంత పురుషులకు లోబడియుండుడి. క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున

పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడైయున్నాడు. సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలు కూడా ప్రతి విషయములో తమ పురుషులకు లోబడవలెను. పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి... దాని కొరకై తన్ను తాను అప్పగించుకొనెను. అటువలెనే పురుషులు కూడ తమ సొంత శరీరములనువలె తమ భార్యలను ప్రేమింపబద్ధులై యున్నారు. తన భార్యను ప్రేమించువాడు తన్ను ప్రేమించుకొనుచున్నాడు. తన శరీరమును ద్వేషించినవాడెవడును లేడుకాని ప్రతివాడును దాని పోషించి సంరక్షించుకొనును. మనము క్రీస్తు శరీరమునకు అవయవములై యున్నాము. గనుక అలాగే క్రీస్తు కూడ సంఘమును పోషించి సంరక్షించు చున్నాడు. ఈ హేతువు చేత పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారిద్దరు ఏక శరీరమగుదురు. మెట్టుకు మీలో ప్రతి పురుషుడును తననువలె తన భార్యను ప్రేమింపవలెను. భార్యయైతే తన భర్త యందు భయము కలిగి యుండునట్లు చూచుకొనవలెను" (ఎఫెసీ 5:22-23).

దేవుని యొక్క సంకల్పము ప్రకారము కుటుంబములో భర్త భార్యకు శిరస్సై యున్నాడు. గృహ సంబంధమైన సమస్త నిర్ణయముల యొక్క బాధ్యత భర్త కలిగియున్నాడు. అతడా నిర్ణయములను తీసికొను చుండుగా భార్య వాటికి లోబడి యుండవలెను. అన్ని విషయముల లోను స్త్రీ పురుషులు సమానమేయని నవ నాగరికులు ఎంత వాదించినను, క్రైస్తవ భార్య మాత్రము తన బాధ్యతలను విరమించుకొనలేదు. క్రీస్తుకును ఆయన సంఘమునకును ఉన్నట్టి సంబంధమును గూర్చి చెబుతు పౌలు, స్త్రీ పురుషుల దాంపత్య సంబంధమును ఉదాహరణగ వినియో గించెను. అందువలన సంఘము క్రీస్తుకు అన్ని విషయములలో ఎట్లు లోబడి యుండునో అట్లే స్త్రీ కూడ తన పురుషునికి విధేయురాలై యుండ వలెనని అతడు హెచ్చరించెను. విధేయత నుండి ఆమె తొలగిననాడు తన కుటుంబ సంతోష జీవము నుండి తొలగినట్లే యగును.

భర్త చేయు నిర్ణయములకు బద్ధురాలై భార్య జీవించవలెనన్నప్పుడు,

ఆమె యెడల అతనికున్న ప్రేమను బట్టి అతడా నిర్ణయములను గైకొనునని ఆమె నమ్మగలిగినదై యుండవలెను. భర్తకూడ తన భార్యయెడల కలిగిన ప్రేమను బట్టి తన బాధ్యతను నెరవేర్చ వలెను. తన సొంత శరీరమువలె ఆమెను ప్రేమించవలెననుటలో ఆనంద దాంపత్య జీవనము యొక్క బాధ్యత స్త్రీ పురుషులకు సమానముగా దేవుడిచ్చెనని మనము గ్రహించకొన గలము. పురుషుడు చూపించవలసిన ప్రేమ కేవలము భౌతిక సంబంధమైన ఆశలు తీర్చుకొనునట్టిది కాదుగాని క్రీస్తునకు వలె నిస్వార్ధ భావముతో భార్యయొక్క అవసరములను తీర్చునట్టి ప్రేమయై యుండవలెను.

మన పాపములను క్షమించు నిమిత్తము మనకొరకు మరణించుటకై యేసే ఆ నిర్ణయమును గైకొనెను. ఆయన మనలను ప్రేమించెను గనుక అట్లు చేసెను. భర్త కూడ అట్టి ప్రేమ కలిగి తన భార్యను గూర్చిన నిర్ణయములను గైకొనుట అత్యవసరము. పురుషుడు తన భార్యను హృదయ పూర్వకముగా ప్రేమించుచున్నప్పుడు అతడామెను నిర్లక్ష్యము చేయుట, ఆమె క్షేమము కొరకై పాటుపడకపోవుట యనునది అసాధ్యము. ఒండొరులకు ఉండవలసిన ప్రేమను గూర్చి వివరించుచు, "ఈ హేతువుచేత పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారిద్దరు ఏక శరీరమగుదురు" అని అపొ.పౌలు చెప్పెను. ఈ సూత్రమును దేవుడు ఆదిలో, ఆదాము హవ్వలతోనే నెలకొల్పెను (ఆది 2:24). దానినే యేసు మత్తయి 19:5లో పునరుద్ఘాటించెను. అదే సంగతిని పరిశుద్ధాత్ముని ద్వారా పౌలు ఈ పాఠములో మనకొరకు పేర్కొనెను.

కుటుంబ సంక్షేమము కొరకు దేవుని యేర్పాటు ఏమైయున్నది? భార్య తన పురుషునికి అన్ని విషయముల లోను విధేయురాలై యుండవలెను. పురుషుడయితే తన భార్యను మిక్కుటముగా ప్రేమించవలెను. స్త్రీ పురుషులు ఈ సూత్రము చొప్పున జీవించునప్పుడు వారి గృహములో సంతోషము తప్ప మరొకటి యుండదు. అయితే స్త్రీ పురుషులు దేవుని ఏర్పాటు నుండి ఎప్పుడైతే తొలగుదురో అప్పుడు ఆ గృహములో అశాంతి తప్పక ఏర్పడును. అనేక గృహములలో నేడు అశాంతి ఎందుకు

ప్రబలియున్నది? భార్య తన పురుషునికి లోబడక పోవుటవలననో, లేక పురుషుడు తన భార్యను ప్రేమించక పోవుట వలననో కదా? నీవెవరయినను సరే, నీ కుటుంబములో సంతోష సమాధానము లేని యెడల దేవుడు నీకిచ్చిన బాధ్యతను సరిగా నెరవేర్చు చున్నావో లేదో పరీక్షించుకొని తక్షణమే సరిదిద్దుకొనుము.

క్రైస్తవ గృహమును గూర్చి మనము ఏమి చెప్పుకొనినను ఆ గృహములో గల తల్లిదండ్రులకును, బిడ్డలకును గల సంబంధమును గూర్చి చెప్పుకొనక తప్పదు. అందువలననే పరిశుద్ధాత్ముడు, బిడ్డలను తండ్రులను ఈవిధముగా హెచ్చరించెను. "పిల్లలారా, ప్రభువునందు మీ తల్లిదండ్రులకు విధేయులై యుండుడి; ఇది ధర్మమే. నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము; అప్పుడు నీవు దీర్ఘాయుష్మంతుడ వగుదువు. ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది. తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను, బోధలోను వారిని పెంచుడి" (ఎఫెసీ 6:1-4). క్రైస్తవ గృహమునకు దేవుడిచ్చిన ఆజ్ఞలు యివి గనుక ఆయన ప్రజలు వీటిని తప్పక పాటించవలెను.

తండ్రులు పిల్లలకు కోపము రేపక ప్రభువుయొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచవలెనన్నప్పుడు వారు తమ పిల్లల యెదుట సరియైన మాదిరి గల జీవితము జీవించ బాధ్యులై యున్నారు. తండ్రి తన బిడ్డల క్షేమము కోరువాడయితే తాను సత్ప్రవర్తన గలవాడై తన బిడ్డలను దేవుని శిక్షలోను బోధలోను ప్రేమతో వారిని పెంచును. ఈ విషయములలో తల్లిదండ్రులు వెనుకాడిన యెడల గృహ జీవము సులభముగా నాశనమగును.

పిల్లలు తమ తల్లిదండ్రులకు విధేయులై యుండవలెనని ప్రభువు ఆజ్ఞాపించుచున్నారు. చిన్నతనము నుండియే ఈ విధేయతను తలిదండ్రులు వారికి నేర్పించవలెను. "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము, వాడు పెద్దవాడై నప్పుడును దాని నుండి తొలగిపోడు" అని దైవవేదము చెప్పుచున్నది (సామె 22:6). చిన్నతనమందే విధేయతను, గౌరవ మర్యాదలను పిల్లలకు తల్లిదండ్రులు నేర్పించని యెడల పిల్లలు పెరిగి పెద్దవారైనప్పుడు

వివేకవంతులై నడుచుకొనుట అసాధ్యము. బాల్యదినములందే సృష్టికర్తయైన దేవుని గూర్చి వారికి బోధించుట అత్యవసరము.

దేవుని చిత్త ప్రకారము నడుచుకొను గృహములో సంతోషమే గాని సమస్యలుండవు. దేవుని చిత్త ప్రకారము స్త్రీ పురుషులు, పిల్లలు నడుచుకొనలేనప్పుడు ఇప్పుడు మరెల్లప్పుడు కూడ శోధనలు, సమస్యలు, అశాంతి, మనోవ్యాకులత తప్ప మరొకటి యుండదు. నీవు క్రైస్తవుడ వైనట్లయిన నీ గృహములోను, నీ హృదయములోను క్రీస్తునే ప్రతిష్ఠించుకొని ఆయన చిత్త ప్రకారము జీవించుటకు నిశ్చయించుకొనుము. సుఖశాంతులను ఆయనే నీకు ప్రసాదించగలరు.

## బోధకులకు బోధకుడైన యేసుక్రీస్తు

**(Jesus Christ The Master Teacher)**

**పరిచయము :**

1. యేసు ప్రభువు యేది చేసినా అది వర్ణనాతీతము, అసమానము. ఆయన సృష్టికర్త, నరావతారి, కల్వరిలో బలి, రక్షకుడు, రారాజు, తీర్పరి మరియు బోధకులకు బోధకుడు.

2. యేసు కంటె యోగ్యుడైన బోధకుడింకెవరు లేరు.

**1. బోధకుడుగా యుండుట అంటే యేమిటి?**

ఎ. రెండు గ్రీకు పదములు బోధకుని వర్ణిస్తాయి. 1. డిడాస్కో అనగా ఉపదేశము, హెచ్చరిక నిచ్చువాడు. ఉదా. మత్తయి 4:23, 9:35; రోమా 1:27; 1 కొరింధీ 4:17; 1 తిమో 1:12; 14:11

2. మధేటెయో (Matheteuo) అనగా బోధించుట. మత్త 28:19 (మత్తయి 28:20 didasco) అపొ.కా. 14:21.

బి. దేవుడు మానవుని బోధకుడై యున్నారు.

1. పాతనిబంధనలో దేవుడు మానవుని బోధకుడైయుండెను. ఆయన మోషేకు బోధించెను (నిర్గమ 4:15).

2. అదే రీతిగా మానవులందరికి క్రొత్త నిబంధనను బోధించుటకు

వాగ్దానము చేసెను. యెషయా 2:2-3.

3. అందు వలన యేసు క్రీస్తు శరీరధారియై ఈ లోకములో అవతరించినప్పుడు ఆయన గొప్ప బోధకునిగా యుండెను.

**II. యేసుక్రీస్తు బోధకుల బోధకుడు.**

ఎ. యేసు ప్రభువు యొక్క ప్రాధమిక ఉద్దేశ్యము, బోధించుట, మత్తయి 4:23, 7:29, 9:35, 13:54, 21:23, 26:55.

1. గొప్ప బోధకుడైన యేసు తన బోధనలో ఉపమానములను పయోగించెను.

2. ఉపమానముల ద్వారా రాజ్యము యొక్క మర్మములను ఆయన బోధించెను.

3. వారిదైనందిన జీవితమును వర్ణించు చిత్రములతో, వారెరిగిన సందర్భములనుపయోగిస్తు ఆత్మీయ సత్యములను ఆయన బోధించెను.

4. యేసుప్రభువు పాఠములను గాక తన మాటలను వినుచున్న వారికి గొప్పగా ఉపదేశించెను (మార్కు 4:1). ఆయన వ్యక్తిగతముగా ఎంతమంది వ్యక్తులకుపదేశించెనో గమనించుము. నికోదేము (యోహాను 3:1), పేతురు (లూకా 5:1-11), సమరయస్త్రీ (యోహాను 4), జక్కయ్య (లూకా 19:1-10), సురోఫెనికయ స్త్రీ (మార్కు 7:24-30). ఆయన ఆయా వ్యక్తులను గుర్తించి మరి ముఖ్యముగా సమాజము వలన ప్రక్కకు తొలగించబడిన వారిని గుర్తించి వారికి ఉపదేశించుట వలన ఆయన దేవుని నుండి వచ్చిన వాడని తెలియుచున్నది.

3. యేసు గొప్ప బోధకునిగా యుండు అధికారము కలిగి యుండెను (మత్తయి 20:18-20).

1. యేసు మాటల ప్రకారము అధికార స్థావరములు రెండే రెండున్నవి. పరలోకము, మనుష్యులు (మత్తయి 21:21-37).

2. యేసును బంధించవలెనని పంపబడిన బంట్రోతులు వట్టి చేతులతో అధికారుల యొద్దకు తిరిగి వచ్చి "ఆయన మాట్లాడినట్లు ఏ మానవుడు ఎన్నడు మాట్లాడ లేదనిరి". వారాయన బోధకు ఆశ్చర్యపడి, బంధించలేకపోయారు (యోను 7:32, 45-46).

3. ఆయన అధికారముతో బోధించారు. నాటి బోధకులకు ఆయన భిన్నమైనవాడు.

4. బయలుపరచబడిన దేవుని వాక్యముపై పరలోకాధికారము ఆధారపడియున్నది.

యేసుకు దేవుని వాక్యమందలి విశ్వాసము వలన ఆయనకు సాటియైన బోధకుడు ఎవరు లేరు. ఆయన లేఖనములకు గొప్ప ప్రాధాన్యత యిచ్చారు (మత్తయి 4:4; 22:29-31, యోహాను 5:39), ఈయనతో పోల్చిచూడగా, ఇశ్రాయేలు బోధకులు లేఖనములను ఎరిగియుండలేదు (మత్తయి 22:29, యోహాను 3:10,12), గనుక నేటి బోధకులు తమ పాఠములలో లేఖనములకు ప్రాధాన్యత ఇవ్వాలి. బైబిలు పరిశుద్ధాత్మా వేశపూరిత దేవుని వాక్యము (2 తిమో 3:16; 2 పేతురు 1:20-21), అది క్రైస్తవులను బలపరుచును (అపో.కా. 20:32). అది మాత్రమే యేసును గూర్చి మనకు తెలియజేయును (యోహాను 5:39, 8:31-32, 47).

సి. ప్రజల కేది అవసరమై యుండెనో దానినే యేసు బోధించే వారు గనుక యేసు గొప్ప బోధకుడు (2 తిమో 4:2-4).

1. మనవలెగాక మనుష్యుని అంతర్యము నాయన ఎరిగినవాడు. అందువలన ఆయనకు సాటియైన బోధకుడెవరు లేరు (యోహాను 2:23-24).

2. యేసు వలె మనము దేవుని వాక్యమును బోధించాలి. అది ప్రజల జీవితములో మార్పును కలుగజేస్తాది.

యేసు సాటి లేని బోధకుడు ఎందువలననగా ఆయన ప్రజల దైనందిన పరిస్థితులను బట్టి వారికి బోధించును. అనేకులకు తమ జీవితం వేరు; మతం వేరు. యేసు అట్లు కాదు. ఆయన దైనందిన జీవిత సంఘటనలను ఉపమానములుగాను, ఉదాహరణగాను వినియోగిస్తు బోధించెను. అందువలన బహుశ సామాన్యప్రజలు సంతోషముతో ఆయన బోధలను వినేవారు (మార్కు 12:37). దైనందిన జీవితంలో లేఖనముల ప్రభావమెంతో యేసు నిరూపించారు (మార్కు 7:1-13). అనుదిన జీవితంలో ఆయనకున్న

అనుబంధము వలన పరిసయ్యుల బోధకును ఆయనకును గొప్ప వ్యత్యాసము కనబడెను (లూకా 11:49,52; మత్తయి 22:3-4).

3. యేసు యేమి బోధించారో దానిని పాటించారు (అపొ.కా. 1:1).

1. పరిసయ్యుల వలెగాక యేసు బోధించిన దానిని పాటించారు (మత్తయి 23:3-5), (మత్తయి 16:24).

2. దేవుని వాక్యమును వ్యక్తిగతము చేసికొనిన వాడే ఈ భూమిపై ప్రముఖ వ్యక్తి. కాపరిగా యేసు అనమాన బోధకుడు ఎందువలననగా ఆయన బోధించిన దానిని అనుకరించారు. అన్ని విషయములలోను ఆయన మనమాదిరియై యున్నారు. విధేయతలో ఆయన మనకు గొప్ప మాదిరి (యోహాను 13:17; హెబ్రీ 5:8-90; 1 పేతురు 2:21). అపొ.పౌలు ద్వారా మార్పు నొందిన వారికతడు అనుకరింపదగిన మాదిరి ననుకొన్నాడు (1 కొరింథీ 4:16; 11:1; ఫిలిప్పీ 3:17). థెస్సలోనికలో యున్న క్రైస్తవులు క్రీస్తును, పౌలును అనుకరించుచున్నందువలన అతడు సంతోషించాడు (1 థెస్స 1:6-7). దేవుని వాక్యమును నేడు బోధించు వారు విధేయతను ధ్యేయముగా యుంచుకొనాలి (మత్తయి 7:24-27; రోమా 2:17, 21, 25). విధేయతను కోరువారు ముందు విధేయతను నేర్చుకోవాలి. మనము వెళ్ళలేని ప్రదేశమునకు నడిపించలేము. మనకు లేని దానిని మనం ఇయ్యలేము. బోధించు చుండగా మనము జ్ఞానము నభ్యసించుటయే కాదు గాని అనుకరింప దగిన మాదిరిగా మనం ఉండాలి.

ఇ. యేసు యొక్క బోధ ఆయన దైవత్వాన్ని రుజువు పర్చాయి.

1. యేసుతో వాగ్వాదమునకు దిగిన వారెవరు ఆయనపై విజయము సాధించలేదు. అది ఆయన దైవత్వానికి గురుతు.

ప్రజల దృష్టిలో యేసును కించపరడానికి యూదుల నాయకులు ఎంత ప్రయత్నించినా, బోధకుల బోధకుడైన ప్రభువు వారి నోళ్ళు ప్రతిసారి మూయించారు.

**పోరాట ప్రతిమ గల క్రీస్తు :** మనం అవవాదితో యుద్ధము

చేయుచున్నాము. దానిని మరచి పోకూడదు. లేఖనములలో ప్రభువు గొర్రెపిల్లగాను, సింహముగాను వర్ణించబడ్డారు. ప్రాధమిక పాఠము యిది. ఏమంటే, మన ప్రభువును వ్యక్తిగతముగా ఎవరైనా ఎదురించినప్పుడు ఆయన పగ తీర్చుకొనరు. ప్రతిస్పందించరు (1 పేతురు 2:22-23). కాని ఆయన బోధను ఎవరైనా ఎదిరిస్తే మట్టుకు ఆయన స్పందన వేరేగా యుండును. ఆయన తిరిగి కొట్టారు. తీవ్రముగా ఎదుర్కొన్నారు, ఖండించారు, తప్పు దిద్దారు (మత్తయి 23:15, 25, 27-25).

2. యేసు క్రీస్తు తప్ప మానవ లోకంలో అంత గొప్ప ప్రభావముగల బోధకుడు ఎవరు, ఎన్నడు లేరు.

యేసు బోధనాపరిచర్య కేవలం మూడున్నర సంవత్సరములే యుండెను. ఆయన గ్రంథము లేమీ వ్రాయలేదు. ఏ విశ్వ విద్యాలయమునకు ఆయన వెళ్ళలేదు, అక్కడ చదువలేదు, బోధించలేదు. ఆయన జన్మ స్థలమునుండి పెద్దంత దూరము ప్రయాణించలేదు. అయినను ఆయన తర్ఫీదు యిచ్చిన మనుష్యుల ద్వారా మరి యే మానవుడు తేలేనంత మార్పును ఈ లోకంలో ఆయన తీసికొని వచ్చారు. ఆయన దైవత్వము ఆయన బోధలలో ప్రతిబింబించి నందున అది సాధ్యమాయెను.

ఎఫ్. యితరులు బోధకులుగా యుండవలెనని బోధించునట్లు ఆయన వారికి బోధించారు. సంకల్పించారు. ఆయన తన శిష్యులకు మనుష్యులను పట్టు జాలరులుగా చేతునని వాగ్దానము చేసారు (మత్తయి 4:15-22).

2. అదే రీతిగా, అపో.పౌలు తిమోతికి బోధించి, యితరులకు బోధింప సామర్థ్యముగల వారినిగా మనుష్యులను తయారు చేయమని హెచ్చరించాడు (2 తిమో 2:2).

**III. దేవుడు తన సంఘములో బోధకులను, ఉపదేశకులు ఉంచారు. తద్వారా సంఘము క్షేమాభివృద్ధి కలుగ జేసికొనెడిది (1 కొరింధి 12:28; ఎఫెసీ 4:11).**

1. 1 కొరింధీ 12:28లో అపొస్తలులు, ప్రవక్తలు, ఉపదేశకులు

2. ఎఫెసీ 4:11లో అపొస్తలులు, ప్రవక్తలు, సువార్తికులు, కాపరులు, బోధకులు కనబడ్డారు.

3. బోధకులు, కాపరులు (పెద్దలు), ఉపదేశకులు దేవుని వాక్యమును ధరించుకొని యుండాలి. వారు మంచి బోధకులు అట్లు కాగలరు.

బి. దైవిక కృషిలో రెండు ప్రాముఖ్యతలున్నాయి.

1. లోకమంతటికీ సువార్త చాటబడుటలో సువార్త బోధించు వారున్నారు (మత్తయి 28:19-20).

2. సంఘ క్షేమాభివృద్ధిలో ఉపదేశకులున్నారు (1 కొరింథీ 14:12,21).

3. ప్రతి క్రైస్తవుడు యితరులకు బోధించు సామర్థ్యము గలవానిగ తయారు కావలసిన బాధ్యతయున్నది (హెబ్రీ 5:11-14), 1 పేతురు 3:15).

ముగింపు :

1. యేసు యొక్క పరిచర్యలో బోధించుట ప్రాముఖ్యాంశము (మత్తయి 4:23).

2. ప్రతి క్రైస్తవుడు యితరులకు బోధించే బాధ్యతగలవాడైయున్నాడు.

3. యేసుక్రీస్తు అనుసరించిన పద్ధతులను మనమును అనుకరించిన యెడల మంచి బోధకులము కాగలము.

4. మనము నిత్యము యేసు క్రీస్తు శిష్యులుగ యుందుము.

- లూయిస్ రష్మోర్

## అందరినీ దీవించాలని దేవుని కోరిక

**(God's desire to Bless all Men)**

కీర్తనల గ్రంథములో 67వ కీర్తన అత్యంత మధురమైనది. మానవులతో దేవునికి గల సంబంధము వలన కలుగు బలమైన వాగ్దానములు దానియందు లిఖించబడి యున్నవి. అది యిట్లు చెప్పుచున్నది.

"భూమి మీద నీ మార్గము తెలియబడునట్లు నా అన్యజనులందరిలో నీ రక్షణ తెలియబడునట్లును దేవుడు మమ్మును కరుణించి మమ్మును ఆశీర్వదించునుగాక. ఆయన తన ముఖకాంతి మీ మీద ప్రకాశింప జేయునుగాక.

"దేవా ప్రజలు నిన్ను స్తుతించుదురుగాక. ప్రజలందరు నిన్ను స్తుంతిచుదురుగాక. న్యాయమును బట్టి నీవు జనములకు తీర్పు తీర్చుదువు భూమి మీదనున్న జనములను ఏలెదవు.

"జనములు సంతోషించుచు ఉత్సాహ ధ్వని చేయుదురు గాక. దేవా ప్రజలు నిన్ను స్తుతించుదురు గాక. ప్రజలందరు నిన్ను స్తుతింతురుగాక.

"అప్పుడు భూమి దాని ఫలము లిచ్చును. దేవుడు మా దేవుడు మమ్మును ఆశీర్వదించును.

"దేవుడు మమ్మును దీవించును. భూదిగంత నివాసులందరు ఆయన యందు భయ భక్తులు నిలుపుదురు" (కీర్తన 67:1-7).

దేవుడు మనలను ప్రేమించు చున్నారు. ఆయన మనకు సంతోషము, శాంతి, కృప, రక్షణ, అనుదిన సంరక్షణ, నిత్య గృహము అనుగ్రహించి దీవించాలని కోరుచున్నారు. ఆయన మనలను ఏల నియ్యాలని మనలను కోరుచున్నారు. మనమాయన వాక్యమునకు విధేయులగుట ద్వారా ఆయన మనలను పాలించును. ఆయన మార్గము, ఆయన చిత్తము మన జీవిత విధానమునకు ఆధారము కావాలని ఆయన కోరుచున్నారు. ఆయన మనకు నీతి న్యాయములతో తీర్పు తీర్చును.

మన జీవమున కవుసరమైన సంగతులను భూమి నుండి ఆయన మనకు పుట్టింతునని వాగ్దానము చేసి యున్నారు. మనమాయనను ఘనపరచి, ఆరాధించి, స్తుతించి, గౌరవించి, ఆయనకు భయపడాలని కోరుచున్నారు.

మనము దేవుని వాక్యము ధ్యానించుచుండగా జీవితంలో ఉద్భవించు ప్రతి ప్రశ్నను ఎట్లు ఎదుర్కొనాలో తెలిసికొనగలము. మన గమ్యమేమిటి? ఇక్కడ ఎందుకు వున్నాము? ప్రతి జనాంగములోను యున్న ప్రతి వ్యక్తికి దేవుడు ఒక వుద్దేశ్యము కలిగి యున్నారు. మనం ఆయనకు లోబడాలని కోరుచున్నారు. అప్పుడాయన మనలను ఆశీర్వదించును.

నేడు మానవునికి దేవుని దీవెనల వుసరము. నేటి లోకమును పట్టి పీడించుచున్న అనేక సమస్యలను దేవుని మార్గము పారద్రోలును. అందువలన దేవుడు మన జీవితములను ఏల నియ్యాలి. అప్పుడాయన దీవించును. మన మాయన యందు విశ్వాసముంచి విధేయత చూపునట్లు మనవే ఎంచుకొనాలని ఆయన కోరుచున్నారు. మనమాయనకు విధేయత చూపాలి లేదా ఆయనను తిరస్కరించాలి. దాని పర్యవసానమును మనమే చూతుము.

- మేయిన్ బేరియర్

# వారు నిర్లక్ష్యము చేసిరి

## (They made Light of it)

మత్తయి 22లో ఒక రాజు యొక్క కుమారుని వివాహమును గూర్చిన ఉపమానమును యేసు చెప్పారు : "పరలోక రాజ్యము తన కుమారునికి పెండ్లివిందు చేసిన యొక రాజును పోలియున్నది. ఆ పెండ్లి విందుకు పిలువబడిన వారిని రప్పించుటకు అతడు తన దాసులను పంపినప్పుడు వారు రానొల్లకపోయిరి. కాగా అతడు ఇదిగో నా విందు సిద్ధ పరచియున్నాను : ఎద్దులును క్రొవ్విన పశువులను వధింపబడినవి, అంతయు సిద్ధముగా ఉన్నది, పెండ్లి విందుకు రండని పిలువ బడిన వారితో చెప్పుడని వేరే దాసులను పంపెను గాని వారు లక్ష్యము చేయక ఒకడు తన పొలమునకు మరియొకడు తన వర్తకమునకు వెళ్ళిరి" (మత్తయి 22:1-14).

ఈ ఉపమానమంతటిలోను దేవుని కృపా ప్రేమలను మనము కనుగొనగలము. "యెహోవా దయాళుడు ఆయన కృప నిత్యముండును. ఆయన సత్యము తరతరము లుండునని" దావీదు చెప్పాడు (కీర్త 100:5). ఈ ఉపమానములో రాజు, ఇదిగో నా విందు సిద్ధ పరచియున్నాను. ఎద్దును, క్రొవ్విన పశువులను వధింపబడినవి. పెండ్లి విందుకు రండని పిలువ బడిన వారికి కబురు పంపెను. విందు ఏర్పాటు చేయుటలో తప్పేమీ లేదని అందరు అంగీకరింతురు. 4వ వచనములో దేవుని దీర్ఘ శాంతము వర్ణించబడినది. రాజు రెండవసారి వారికి వర్తమానము పంపెను. ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారు మనస్సు పొందాలని కోరుచు దేవుడు మన యెడల దీర్ఘ శాంతము కలిగి యున్నారు (2 పేతురు 3:9).

గాని వారు ఆ పిలుపును లక్ష్యము చేయక రానొల్లకపోయిరి. విందుకు పిలువ బడినవారు దానిని లక్ష్యము చేయులేదు. వారి మనస్తత్వము అట్లుండెను. అది వారికి అంత ప్రాముఖ్యము కాదు. ప్రభువు యొక్క ఆహ్వానమును గూర్చి కొందరు అట్లే తలంచెదరు. ఆయన ఆహ్వానమును లక్ష్యపెట్టనవుసరం లేదని వారను కొంటారు. అది వారి

కంత ప్రాముఖ్యము కాదు గనుక లక్ష్య పెట్టరు. పాపులైన వారు సువార్తను విని దానికిలోబడి రక్షణ పొందవలెనని ప్రభువు వారిని ఎల్లవేళలా ఆహ్వానించు చునే యున్నారు. గాని వారు దానిని లక్ష్యము చేయక యున్నారు. ప్రభువు యొక్క ఆహ్వానమును లక్ష్యము చేయక పోతే అది పాపమే.

నేటి ప్రజలు లేఖనములను లక్ష్యము చేయక యున్నారు. "దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును ఖండించుటకును తప్పుదిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నదని" అపో. పేతురు చెప్పాడు (2 పేతురు 1:21). దేవుని వాక్యము మన ఆత్మలను రక్షించుటకు శక్తి గలది యని యాకోబు వ్రాసాడు (యాకోబు 1:21). అయినను సరే, ప్రజలు వీటిని దేవుని వాక్యమును లక్ష్యము చేయక యున్నారు. "మీరు సత్యమును గ్రహింతురు; సత్యము మిమ్మును స్వతంత్రులునుగా చేయునని" మన ప్రభువు చెప్పారు (యోహాను 8:32). బానిసలుగా చేయు శక్తి పాపము నకున్నది. ఏలయనగా దేవుని బిడ్డకాని వాడు పాపమునకు బానిసయే. "లోబడుటకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించుకొందురో అది చావు నిమిత్తముగా పాపమునకేగాని, నీతి నిమిత్తముగా విధేయతకే గాని దేనికి మీరు లోబడుదురో దానికే దాసులగుదురని మీరెరుగరా? మీరు పాపమునకు దాసులైయుంటిరి గాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయ పూర్వకముగా లోబడినవారై పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి; ఇందుకు దేవునికి స్తోత్రము" (రోమా 8:16-18).

ప్రజలు తరుచు పాపమును లక్ష్యము చేయరు. "పాపము ప్రజలకు అవమానము తెచ్చును'' అని సోలోమోను చెప్పాడు (సామె 14:34). "మీ పాపము మిమ్మును పట్టుకొనును" అని వాక్యము చెప్పుచున్నది (సంఖ్యా 32:23). దేవుని ఆజ్ఞలకు లోబడకపోతే మీరు పరలోకమునకు వెలుపలయుందురు. "జీవవృక్షమునకు హక్కు గలవారై గుమ్మములగుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉతుకొనువారు ధన్యులు" (ప్రక 22:14). యోబు వలె దేవుని

వాక్యమును మనము గౌరవించాలి. "ఆయన పెదవుల ఆజ్ఞను నేను విడిచి తిరుగలేదు. ఆయన నోటి మాటలను నా స్వాభిప్రాయము కంటె ఎక్కువగా ఎంచితిని" యని అతడు చెప్పాడు (యోబు 23:12).

అనేకులు తమ ఆత్మల విలువను లక్ష్యము చేయరు. "ఒకడు సర్వలోకమును సంపాదించుకొని తన ప్రాణమును (ఆత్మను) పోగొట్టుకొనుట వానికేమి ప్రయోజనము? మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా ఏమి ఇయ్యగలడు?" అని యేసు బోధించారు (మార్కు 8:36). కొందరు తీర్పును గూర్చి లక్ష్యము చేయరు. గాని ఒకానొక దినమందు మనమందరము క్రీస్తు న్యాయ పీఠము యెదుట ప్రత్యక్షమవుతాము (2 కొరింథీ 5:10). కొందరు నరకమును గూర్చి లక్ష్యము చేయరు. అయితే ధనవంతుడు పాతాళములో బాధపడుచు కన్నులెత్తిచూచినట్లు యేసు చెప్పారు (లూకా 16:23). మిత్రులారా, దేవుని వాక్యాన్ని, రక్షణ సంకల్పాన్ని ఎన్నడు నిర్లక్ష్యము చేయవద్దు!

– జాన్ హేరిస్

# యేసుక్రీస్తు యొక్క పరిచర్య

**(Ministry of Jesus)**

"సమస్తము దేవునివలననైనవి, ఆయన మనలను క్రీస్తు ద్వారా తనతో సమాధాన పరచుకొని ఆ సమాధాన పరచు పరిచర్యను మీకు అనుగ్రహించెను" (2 కొరింథీ 5:8).

**పరిచయము :**

1. అపో.పౌలు తాను క్రీస్తు దాసుడనని పిలుచుకొనెను (ఫిలిప్పీ 1:1).

2. కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రికలో క్రీస్తు పరిచర్య యొక్క విశేష లక్షణములను గూర్చి అతడు చెప్పాడు.

ఎ. క్రీస్తు యొక్క పరిచర్య ఘనమైనది.

బి. క్రీస్తుయొక్క పరిచర్య పరిశోధింపబడిన యదార్థ పరిచర్య.

సి. క్రీస్తు పరిచర్య నమ్మకత్వము గలది.

డి. క్రీస్తు పరిచర్య శ్రమానుభవము గలది.

**క్రీస్తు యొక్క ఘనమైన పరిచర్య :**

1. ఆయన పరిచర్య పాత నిబంధన కంటె మరింత ఘనమైనది (2 కొరింధీ 3:7-5).

2. పాత నిబంధన తీసివేయబడెను గాని క్రొత్త నిబంధన మరింత మహిమ గలదిగా యుండును (2 కొరింధీ 3:11).

**క్రీస్తు పరిచర్య శోధింపబడిన యదార్థ పరిచర్య :**

1. క్రీస్తు పరిచారకులుగా మనం కుయుక్తిని విసర్జించాలి (2 కొరింధీ 4:2).

2. మనం హింసింపబడుదుము శ్రమలనొందుదుముగాని నాశనము గావింపబడము (2 కొరింధీ 4:8-9).

3. మన శరీరములో యేసుయొక్క జీవితం ప్రదర్శింపబడాలి (2 కొరింధీ 4:10).

**క్రీస్తు పరిచర్య నమ్మకత్వము గల పరిచర్య.**

1. భూమి మీద మన జీవితం చాలించిన తరువాత పరలోకమందు మనకొక నివానముున్నదనునది క్రైస్తవుల నిరీక్షణ (2 కొరింధీ 5:1).

2. పరలోక వస్త్రము ధరించుకొను కాంక్ష గలవారము.

3. అందువలన పౌలు దేహమందున్నను లేకపోయినను ప్రభువుతో యుందునని నమ్మకము కలిగియుండెను (2 కొరింధీ 5:8).

**క్రీస్తు పరిచర్య సమాధాన పరచునది:**

1. "కావున మేము ప్రభువు విషయమైన భయము నెరిగి మనుష్యులను ప్రేరేపించుచున్నాము" (2 కొరింధీ 5:11). వారు ప్రభువుతో సమాధానపడవలెనని ప్రేరేపించు చున్నాము.

2. క్రీస్తు ద్వారా దేవుడు మనలను తనతో సమాధాన పరచుకొనెను. గనుక సమాధాన సువార్తను, పరిచర్యను మనకనుగ్రహించెను (2 కొరింధీ 5:18-20).

**క్రీస్తు పరిచర్య శ్రమలతో కూడినట్టిది.**

1. క్రీస్తు పరిచర్యలో అనేక శ్రమలు కలుగవచ్చును (2 కొరిం. 6:4).

2. కొన్నిసార్లు దుఃఖము సంభవించినను, మనం ఎల్లప్పుడు సంతోషముగా యుండాలి (2 కొరింధి 6:10).

**ముగింపు :**

క్రీస్తు పరిచర్య మహిమ గలది.

క్రీస్తు పరిచర్య శోధింపబడినది, యదార్థమైనది.

క్రీస్తు పరిచర్య నమ్మకత్వము గలది.

క్రీస్తు పరిచర్య సమాధాన పరచునది.

క్రీస్తు పరిచర్య శ్రమలననుభవించునది.

**- రోనీ గూటం**

## ఆత్మను చంపునట్టి స్వార్థము

**(Selfishness, the Soul Killer)**

తన్ను గూర్చియే విపరీతముగా ఆసక్తి కలిగియుండుట, ఒకని స్వలాభము, సంతోషము, సంక్షేమమును గూర్చి తన్ను తాను హెచ్చుగా ఆసక్తి కలిగియుండుటను స్వార్థ పరత్వమని చెప్పుకోవచ్చును. స్వార్థ పరత్వమను పాపమును గూర్చి మనందరము జాగ్రత్తగా యుండాలి. ఎందుకనగా అంత్యదినములలో అపాయకరమైన కాలములు వచ్చును. ఏలాగనగా మనుష్యులు స్వార్థ ప్రియులు, ధనాపేక్షులు, అని అపొ.పౌలు 2తిమో 3:1-2లో చెప్పి యున్నాడు. మనము ఇప్పుడు అంత్య దినములలో యున్నాము.

స్వార్థ పరత్వము ప్రమాదకరము ఏలయనగా అది అనేక పాపములతో ముడివడి యున్నది. 1 రాజులు 21లో ఆహాబురాజు నాబోతు యొక్క ద్రాక్షతోట తనకు కావాలనుకొన్నాడు. ఆహాబు యొక్క స్వార్థ పరకోరిక నెరవేరుటకు గాను యెజెబెలు నాబోతును చంపించినది. స్వార్థ పరత్వము తరుచు నరహత్యతో ముడివడి యుంటాది. అది అహంభావముతో కూడ పెనవేసుకొని యుంటాది.

3 యోహాను 9వ వచనములో "నేను సంఘమునకు ఒక సంగతి వ్రాసితిని. అయితే వారిలో ప్రధానత్వము కోరుచున్న దియొత్రెఫే మమ్మును అంగీకరించుట లేదు" అని భక్తుడైన యోహాను వ్రాసాడు.

ఇక్కడ ప్రధానత్వమును కోరుకొనుచున్న యొక మనుష్యుడు వున్నాడు. అతడు స్వార్థపరుడు. అన్నిటిలోను తనకే ఘనత కావాలను కొన్నాడు. మీ స్థానిక సంఘములో అట్టివారిని నీవు గమనించావా? స్వార్థపరులు సాధారణంగా తరుచు

ఆరాధనకు రారు. ఎందుకు రాలేదు అని అడిగితే, నేను నిద్రపోవాలి, మిత్రులు వచ్చారు, ఆదివారమున పనికి వెళ్ళకపోతే నాకు డబ్బు చాలదు మొదలగు వాటిని చెబుతారు. "కొందరు మానుకొనుచున్నట్లుగా సమాజముగా కూడుట మానవద్దు" అని అపొ.పౌలు హెబ్రీ 10:25లో హెచ్చరించాడు.

ధనాపేక్ష, స్వార్థపరత్వమునకు దారితీయును. నిత్య జీవనమును కాంక్షించుచు యౌవనుడొకడు యేసు నొద్దకు వచ్చాడు. "నీవు పరిపూర్ణుడ వగుటకు కోరిన యెడల, పోయి నీ ఆస్తిని అమ్మి బీదలకిమ్ము అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును, నీవు వచ్చినన్ను వెంబడించుమని" ఆయన ఆతనితో చెప్పెను. "అయితే ఆ యౌవనుడు మిగుల ఆస్తిగలవాడు గనుక ఆ మాటవిని వ్యసనపడుచు వెళ్ళిపోయెను" (మత్తయి 19:21-22).

స్వార్థము వలన సంఘ సభ్యులు దేవుని పనికి ధారాళముగా ధనము నియ్యరు. అయితే నిస్వార్థపరులు బీదలైనను తమ గుప్పిళ్ళు విప్పి ధారాళముగా ఇస్తారు. మాసిదోనియ సంఘములకు అనుగ్రహింపబడి యున్న దేవుని కృపను గూర్చి మీకు తెలియజేయుచున్నాను. ఏలాగనగా వారు బహు శ్రమవలన పరీక్షింపబడగా అత్యధికముగా సంతోషించిరి. మరియు వారు నిరుపేదలైనను వారి ధాతృత్వము బహుగా విస్తరించెను. వారు తమ సామర్థ్యము కొలదియే గాక సామర్థ్యము కంటె ఎక్కువగాను తమంతట తామేయిచ్చిరని మీకు సాక్ష్యమిచ్చు చున్నాను" (2 కొరింధీ 8:1-4). స్వార్థ పరమును వీడి యితరులను ప్రేమించుచు, ప్రభువు పనిలో సహకరించువారు ధన్యులు.

-జాన్ స్టేసీ

## నేనెందుకు ఇయ్యవలెను?

**(Why must I give)**

సంఘములో డబ్బును గూర్చి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చుచున్నాము. అని కొందరు నింద వేస్తారు. ఆత్మీయ సంగతులను గూర్చి మాట్లాడు చున్నప్పుడు డబ్బును గూర్చి మాట్లాడుట మంచిది కాదని కొందరనుకొంటారు. అయితే యేసు అట్లు విశ్వసించలేదు. ఆయన తరుచు

ధనాన్ని గూర్చి మాట్లాడారు. ఆయన చెప్పిన ఉపమానములలో మూడింట రెండు వంతులు ధనాన్ని గూర్చి యున్నవే. మతాన్ని కానుకలను విడదీయడం అసాధ్యం అని ఆయన భావించారు (లూకా 6:38). నిజానికి బైబిలులో ఇచ్చుటను గూర్చి 7000 సార్లు చెప్పబడియున్నది.

నిజానికి మనం దేవునితో జీవించాలని కోరుచున్నప్పుడు ఇచ్చుటను గూర్చి తప్పక చెప్పుకోవాలి. ఎందువలననగా...

**ఇచ్చుట ఆరాధనయైయున్నది :** ఇయ్యకుండా దేవుని ఆరాధించుట అసాధ్యము! బైబిలులో ఆరాధనను గూర్చి చెప్పబడినది (ఆది కా. 22:5). ఆరాధన యనగా భక్తి భావములతో గౌరవించుట, ఘనపరచుట, కొనియాడుట యని అర్థము.

**ఇచ్చుట శిష్యత్వపు అనుభవమై యున్నది :** ఇయ్యకుండా మనము శిష్యులుగా యుండలేము. "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా. ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను" అని అపొ. పౌలు చెప్పెను (2 కొరింథీ 8:9). అన్ని విషయములలో యేసు మనకు మాదిరియై యున్నారు. ఆయన ప్రజలుగా యుండాలంటే ఆయన చేసినట్లే మనమును చేయాలి. చరిత్ర అంతటిలో ఆయన కంటె ఎక్కువ యిచ్చిన వారెవరులేరు. ఆయన గొప్ప దాత. ధనవంతుడైన యౌవనుడు తనకు కలిగిన దానిని యిచ్చుటకు నిరాకరించినందున ఆయన శిష్యుడు కాలేకపోయాడు. ఇచ్చుటను గూర్చి సరియైన స్వభావము లేనందున క్రీస్తును మనం పూర్తిగా అనుసరించ లేక పోవుచున్నాము.

**ఇచ్చుట ప్రేమకు నిదర్శనము :** ఇచ్చుట వలన ప్రేమ యొక్క యదార్థత ప్రదర్శింపబడును. ఇచ్చుటలో ప్రేమ కనబడును (యోహాను 3:16). కొరింథీయులు ఇచ్చి ప్రేమ పరీక్షలో నిలబడాలని పౌలు వారిని హెచ్చరించాడు (2 కొరింథీ 8:8). ప్రేమ యిచ్చును! అది అంత నాక్ష్మమైనది. తగిన రీతిగా ఇవ్వకపోవుట అపరిపూర్ణ ప్రేమకు, పరిపక్వము కాని పెరుగుదలకు నిదర్శనము.

**ఇచ్చుట ఐక్యతకు నిదర్శనము:** నిజానికి ఇచ్చుట దేవునికి మానవునికి మధ్యయున్న సంబంధమైయున్నది. ఒకరితో నొకరు ఈ సత్ క్రియల విషయములలో సహవాసము కలిగి యుండుటకు ఇయ్యవలెనని పౌలు కొరింథీయులను హెచ్చరించాడు (2 కొరింథీ 8:1). సంఘ కార్యక్రమముల విషయమైతే మనందరము వేర్వేరు దృక్పథములు కలిగి చలించుదుము. అయినను ఇచ్చుటవలన ఆ కార్యక్రమము జరిగించబడాలనే కోరికగల వారమైయున్నాము. అక్కడ మన అభిప్రాయములను గాక అందరితోను కలసి పని చేయుదుము. మనం యిచ్చే చందా వలన జరుపు కార్యక్రమములలో మనకు పాలున్నదని ప్రకటించుచున్నాము. దేవుని కుటుంబముగా అందరము కలసి పనిచేయుదుము.

అన్నిటికంటె ముందు మనకు మనమే సమర్పించుకోవాలి (2 కొరింధి 8:5). స్వీయ సమర్పణ అన్నిటికంటె కష్టమైనది. నీవు దానిని జరిగించేవరకు దేవునికి పనికి వచ్చు సాధనముగా యుండలేవు!

- బాబీడాకిరీ

# యేసు ప్రేమించిన శిష్యుడు

## (The Discriple Jesus loved)

జెబెదయి కుమారుడగు యోహానును యేసు ప్రేమించారు. ఒక శిష్యుడెట్లుండాలో అతని జీవితం మనకు మాదిరియై యున్నది. అతడంటే యేసుకు ఇష్టము. మనము అనుకరించదగు ఒక ఆత్మీయ నాయకుడతడు.

సలోమి, జెబెదయులకు అతడు కనిష్ట పుత్రుడు. వారు జాలరులు. అతని కుటుంబము కష్టపడి పనిచేసేది. వారు తగినంత ఆదాయము కలిగి సుఖమయిన జీవితం జీవించేవారు. యోహాను సముద్రములో, వలలు వేయుచు, చేపలు పట్టుచు పెరిగాడు. గాని ఒక దినమందు యేసు అతని చూచి పిలిచారు. అతని జీవితం మారి పోయింది.

యేసును చూచి యోహాను ఆశ్చర్యపోయాడు. ఆయన అద్భుతములు, బోధలు, వ్యక్తిత్వము అంతా యోహానును కట్టడి చేసేసాయి. అతడు యేసును వెంబడిస్తూ త్వరలో ఆయన శిష్యుడైపోయాడు. ఆయనకు

సన్నిహితుడైన మిత్రుడైపోయాడు. ఆయనతోకూడ రూపాంతరము పొందిన కొండనుండి, గెత్సెమనెకు, సిలువ వరకు మరియు ఖాళీ సమాధి యొద్దకు ఆశ్చర్యమైన ప్రయాణము చేసాడు. ఈ యౌవనస్థుడు పరిపూర్ణముగా మార్చివేయబడ్డాడు. అతడు దేవునితో యున్నాడు. అది అతనికి తెలుసు. మరియు అతడు తన ప్రభువు యొక్క ఆజ్ఞలననుసరిస్తు సర్వ లోకానికి దాన్ని గూర్చి చెబుతాడు.

పరిశుద్ధాత్ముడు దిగి రావడం, పెంతెకోస్తు నాడు వేల కొలది ప్రజలు మారడం, సంఘారంభ దినాల్లో క్రైస్తవ్యము విపరీతిగా వ్యాప్తి చెందడం వగయిరా అంతా యోహాను చూచాడు. దేవుని చేతిలో పరికరముగా అతడు వాడబడ్డాడు. అతడు విమర్శ సభలలోనికి పిలువబడ్డాడు. హెచ్చరింపబడ్డాడు. బంధింపబడ్డాడు. విడుదల చేయబడ్డాడు. మరల బంధింపబడ్డాడు. అయినను సువార్త బోధిస్తునే యున్నాడు. తార్సువాడైన సౌలు క్రీస్తు సంఘమును హింసించుటకు అతడు ప్రత్యక్షసాక్షిగా యున్నాడు. సంఘము చెల్లాచెదురై పోవుట చూచాడు. చివరకు సౌలుకు సహవాస హస్తమునందించాడు. అతడు మార్పు నొంది క్రైస్తవుడయ్యాడు. అన్యజనులకు సువార్తికుడయ్యాడు.

యెరూషలేములో .అతని సోదరుడు హతసాక్షిగా మరణించుట చూచి యోహాను కలతజెందాడు. చివరకు పరిశుద్ధాత్మ వలన ఎఫెసుకు కొనిపోబడ్డాడు. డొమేషియన్ నిరంకుశ పాలన కాలములో అతడు పద్మాసు ద్వీపముకు జీవితకాల బందీగా వెలివేయబడ్డాడు. అక్కడ అతని ప్రభువు ఆయన గొప్ప సంకల్పమును దర్శనము ద్వారా తెలియజేసారు. దానినంతటిని గ్రంథస్తము చేయమని చెప్పారు. కీ॥శ॥ 98వ సంవత్సరములో కడు వృద్ధుడును, బలహీనుడైన ఈ అపొస్తులుడు దేశ భ్రష్టత నుండి విడుదల చేయబడ్డాడు. ఆసియాకు తిరిగి వచ్చాడు. తన మరణము వరకు సంఘమునకు పరిచర్య చేయుచు వచ్చాడు.

యేసు ప్రేమించిన ఈ శిష్యుడు ఆయన అతని పిలిచిన నాటి నుండి ఎఫెసులో మరణించే వరకు యేమీ తడబడలేదు. నాగటిమీద చేయవేసి వెనుకకు చూడని వాని కథనము యోహానుది. అతని యజమాని ఎవరో అతడెరిగియుండెను. అంతము వరకు ఆయనను అతడు వెంబడించెను. శిష్యుడనగా అర్థము ఇదియే.

\- డేన్ ఓవెన్స్

## సంక్షిప్త వార్తలు

2016 జూన్ 1,2,3 తేదీలలో అమలాపురం కరక్కాయపేటలోని క్రీస్తు సంఘము మూడు దినములు గొప్ప సువార్త కూటములు నిర్వహించిరి. అమలాపురం పట్టణ పరిసర ప్రాంతముల నుండి అనేకులైన సువార్తికులు సభ్యులు హాజరై గొప్పసహవాసము యొక్క ఆనందము ననుభవించిరి. మంచి ఆత్మీయానుభవము నొందిరి. సోదరులు పి.యస్.ఆర్. జయపాల్ (ర్యాలి), జాషువా గూటం, మరియు ఎ. విశ్వేశ్వరరావు (కొవ్వూరు) గార్లు వాక్యపరిచర్య చేసిరి. హాజరైన వారందరికీ స్థానిక క్రీస్తు సంఘము మంచి భోజనముల నేర్పాటుచేసిరి.

2016 జూన్ 3వ తేదీన మద్రాసులోని కొరుక్కుపేట క్రీస్తు సంఘము ఏర్పాటు చేసిన రెండు దినములు ఆల్ ఇండియా సువార్తికుల సహవాస కూటము ఘనముగా జరిగెను. రెండు, మూడు వందల మంది సువార్తికులు హాజరై మంచి బైబిలు అంశములు వివరించబడగా గొప్ప మేలు పొందిరి. కొరుక్కుపేట క్రీస్తు సంఘము చక్కని ఏర్పాట్లు చేసిరి. హాజరైన వారందరు ఆ సంఘము యొక్క కృషిని, వ్యయ ప్రయాసలను, ఆసక్తిని చూచి అభినందించిరి. సోదరులు వి. రాజు గారు అనారోగ్యముతో యున్నను సహవాస కూడిక నిరాటంకముగా జరుగునట్లు పర్యవేక్షించగలిగిరి.

2016 జూన్ 10వ తేదీనాడు రిక్కీ గూటం గారు అమెరికా పర్యటన ముగించుకొని కాకినాడకు క్షేమముగా చేరుకొనిరి. ఆయన అక్కడ గడిపిన 40 దినములలో అనేకమంది మిత్రులను సంఘములను దర్శించి వాక్యపరిచర్యచేసిరి. మెంఫిస్ పట్టణములో యున్న రోనీ గూటం దంపతులతో కొన్ని దినములు గడిపిన తరువాత ఇంటికి క్షేమముగా చేరుకొనిరి. మరియు జూన్ 16వ తేదీ గురువారం ఉదయానికి అమెరికాలో ఉద్యోగము చేస్తూయున్న రాబిన్ గూటంగారు సతీ సమేతంగా విశాఖపట్టణము, తదుపరి కాకినాడకు క్షేమముగా చేరుకొనిరి. వారు ఇండియాలో కొంతకాలము గడుపుటకు సిద్ధపడి వచ్చిరి.

2016 జూన్ 20వ తేదీ సోమవారం నరసాపురపేటలో యున్న క్రీస్తు

సంఘము వారి చర్చి బిల్డింగ్ యొక్క మూడవ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన స్తుతి కూటములో జాషువా గూటంగారు, రిక్కీ గూటం గారు చక్కటి వాక్యపరిచర్య చేసిరి. ఆ రోజు అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షమువలన ఆ ప్రాంతమంతయు జలమయమైపోయినను అనేకులు హాజరై దేవుని స్తుతించిరి. అక్కడ కష్టించి పని చేయుచున్న సోదరులు యన్. ప్రసాద్‌గారు వారి కుమారులు, కుటుంబ సభ్యులు అభినందనీయులు.

సత్యవాణి టి.వి. కార్యక్రమములు ప్రతిరోజు ఉదయం 7-30 గం॥టలకు కాంతి ఛానల్‌లో ప్రసారము చేయబడు చున్నవి. మరియు ప్రతి ఆదివారం సాయంత్రం 6-00 గం॥లకు శుభవార్తలోను, ప్రతి బుధవారం సాయంత్రం 6-30 గం॥లకు రక్షణ ఛానల్‌లోను ప్రసారము చేయబడుచున్నవని జాషువా గూటంగారు తెలియజేయుచున్నారు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17
Date of Posting: 14 & 15th every month

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001



Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.